


వన్డే క్రికెట్ మ్యాచ్ స్కోరర్‌గా విజయ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 19న భారత్, ఆస్ట్రేలియా మధ్య విశాఖలోజరగనున్న అంతర్జాతీయ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌కు స్కోరర్‌గా విజయనగరానికి చెందిన బిసిసి స్కోరర్ తోట విజయ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆంధ్ర క్రికెట్ సంఘం ప్రకటించింది. ఇప్పటి వరకు విజయ్ 9 వన్ డే మ్యాచ్ లు, నాలుగు 20-20 మ్యాచ్‌లు, 2 టెస్ట్ మ్యాచ్ లు, 13 ఐపిల్ మ్యాచ్ లకు స్కోరర్‌గా భాద్యతలు నిర్వహించారు. విజయ్ 350 పైగా మ్యాచ్ లకు అంపైర్ గా కూడా వ్యవహరించారు. తన అభివృద్ధి వెనక తన కుటుంబం, జిల్లా సంఘ పెద్దల సహకారం ఎంతో ఉందని తెలిపారు.



తోటపల్లి, రామతీర్థసాగర్ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ గడప దాటడం లేదు. ఏటా రూ.వందల కోట్లు గుమ్మరిస్తున్నట్టు బడ్జెట్ సమావేశాల్లో చెప్తున్నప్పటికీ ఆచరణలో అందుకనుగుణంగా నిధులు విడుదల చేయడం లేదు. ఈ ఏడాది ఈ రెండు ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో, సర్దార్ గౌతులచ్చన్న తోటపల్లి బ్యారేజీ సాగునీటి లక్ష్యం 55శాతం వద్ద నిలిచిపోయింది. రామతీర్థసాగర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గురువారం జరగనున్న బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వం జనవరి నెలలోనే నీటిపారుదల శాఖను ప్రతిపాదనలు కోరింది. ఎప్పటి మాదిరిగానే ప్రతిపాదలకే పరిమితమౌతుందా? లేక పాలనలో చివరి ఏడాదైనా నిధులు కేటాయింపు, విడుదలతో ఉదారంగా వ్యవహరిస్తుందా? అన్న సందేహంతో రైతాంగం ఎదురు చూస్తోంది.


అసంపూర్తిగా వదిలేసిన తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు

సాగునీటి రంగానికి.. నిధులు కేటాయించేనా?

- బిల్లులు అందక పనులు నిలిపివేసిన తోటపల్లి కాంట్రాక్టర్
- 59 వేల ఎకరాలకు అందని సాగునీరు
- రామతీర్థసాగర్‌కు గతేడాది విడుదల చేయని ప్రభుత్వం
- పడకేసిన జలాశయం, కాలువ పనులు
- జంఝావతి, వెంగళరాయ, పెదంకలాం, పెద్దగెడ్డ, ఆంధ్ర, తాడిపూడిలోనూ అదే తీరు
- నేడు రాష్ట్ర బడ్జెట్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో 64వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరిస్తూనే విజయనగరం జిల్లాను కలుపుకుని సుమారు 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో తోటపల్లి బ్యారేజీని తలపెట్టిన విషయం విధితమే. ఇప్పటి వరకు రూ.891కోట్లు ఖర్చు చేసినప్పటికీ నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల అంచనా వ్యయం ఏటా పెరిగిపోతోంది. వైసిపి అధికారంలో వచ్చాక సాగునీటి కేటాయింపులు పరిశీలిస్తే 2019-20 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.156కోట్లు కేటాయించగా, ఆచరణలో రూ.13.64కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. 2020-21లో రూ.225.57కోట్లు కేటాయించగా రూ.37.27 కోట్లు చెల్లించింది. 2021-22లో 199.70కోట్లకుగాను రూ.1.35కోట్లే ఇచ్చింది. 2022-23లో రూ.126.61కోట్లు కేటాయిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో రూ.4.26కోట్లు మాత్రమే కేటాయించింది. మరోవైపు పని బిల్లులు రూ.4.23కోట్లు, ఇంటర్ లింకింగ్ పనులకు రూ.1.64కోట్లు, భూ సేకరణకు 21లక్షలు చొప్పున సుమారు రూ.6.37కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. పిల్ల కాలువలు, మదుములు, స్ట్రక్చర్లు, లైనింగ్ పనులు పెండింగ్‌లో వున్నాయి. మరో 291.48ఎకరాల భూమి సేకరించాల్సింది. వీటన్నింటికీ కలిపి రూ.500కోట్లు అవసరమౌతుందని ప్రాజెక్టు అధికారులు అంచనా వేశారు. నిధులు విడుదల విషయంలో ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేస్తుండడంతో తోటపల్లి సాగునీటి లక్ష్యం నీరుగారుతోంది. పెండింగ్ పనుల వల్ల 58,757ఎకరాలకు సాగునీరు అందడం లేదు.

24 వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం ప్రజల దాహార్తి తీర్చేందుకు తలపెట్టిన రామతీర్థసాగర్ ప్రాజెక్టుకు గత ఏడాది (2022-23)లో 124.50కోట్లు కేటాయిస్తామంటూ బడ్జెట్ సమావేశంలో చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. 2021-22లో రూ.201కోట్ల కేటాయింపునకుగాను విడుదల చేసింది కేవలం రూ.28.49కోట్లే. అంతకు మునుపు కూడా తోటపల్లి మాదిరిగానే అరకొర బడ్జెట్ కేటాయించింది. ఇటువంటి కారణాల వల్ల రూ.220 కోట్లతో తలపెట్టిన ఈ ప్రాజెక్టు అంచనా విలువ 2020 ఏప్రిల్ నాటికి 739.9కోట్లకు పెరిగిపోయింది. ఇప్పటి వరకు ఖర్చుచేసింది రూ.281.51కోట్లు మాత్రమే. ఈ నిధులతో బ్యారేజీ పని 90శాతం, జలాశయం పనులు 60శాతం, కాలువల పనులు 6శాతం పూర్తయ్యాయి. మిలుగు పనులు, 350ఎకరాల మేర భూసేకరణ, ఆర్అండ్ఆర్‌కు మరో 458.38కోట్లు అవసరమౌతాయని ప్రాజెక్టు అధికారులు ఏటా నివేదికలు పంపుతునే ఉన్నారు. ప్రభుత్వం మాత్రం కంటితుడుపు కేటాయింపులు చేస్తోంది. దీంతో, అటు తోటపల్లి, ఇటు రామతీర్థసాగర్ ప్రాజెక్టులు పూర్తికావడం లేదు. ఈ నేపథ్యంలో ఏటా కేటాయింపులు తప్ప నిధుల విడుదల ఏదీ అంటూ చర్చసాగుతోంది. జంఝావతి, వెంగళరాయ, పెదంకలాం, పెద్దగెడ్డ, ఆంధ్ర, తాడిపూడి తదితర జాలాశయాల్లోనూ ఇదే తీరు కనిపిస్తోంది. వీటి ఆధునీకరణకు జైకా నిధులు మినహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెద్దగా సహకారం అందడం లేదు. దీంతో, ఉన్న ఆయుకట్టును స్థిరీకరించుకోవడం కూడా కష్టతరడం మారింది. గుర్ల గెడ్డ సహా పలు చోట్ల తలపెట్టిన మినీ రిజర్వాయర్లు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఈనేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్‌లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తుందన్న ఆశతో రైతాంగం ఎదురు చూస్తోంది.

నేడే పట్టభద్రుల తీర్పు

- ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- ఇనిషియల్ కౌంటింగ్‌కు 8 గంటలు
- తొలి ఫలితానికి ఒక రోజు సమయం
- 28 టేబుళ్లపై లెక్కింపు
- 500 పైచిలుకు కౌంటింగ్ సిబ్బంది


కౌంటింగ్ ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి తీర్పు వెలువడే సమయం వచ్చేసింది. ఈ నెల 13న జరిగిన పోలింగ్ ఫలితాల కోసం కౌంటింగ్ గురువారం ప్రారంభం కానుంది. ఓటరు తీర్పు ఎలా ఉంటుందన్న ఉత్కంఠ ఉత్తరాంధ్ర అంతటా నెలకొంది. విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లన్నింటినీ విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ చూస్తున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికకు 2 లక్షలా 926 ఓట్లు పోలయ్యాయి. వీటి లెక్కింపునకు 28 టేబుళ్లను స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఒక రౌండ్‌కి 1000 ఓట్ల ఫలితాన్ని సిబ్బంది లెక్కిస్తారు. ప్రారంభ కౌంటింగ్ అయ్యేసరికి 8 గంటల సమయం పడుతుంది. తొలి ఫలితంతో దాదాపు ఒక అంచనాకు రావొచ్చు. పూర్తిగా ఫలితం రాబట్టేందుకు ఒక రోజు వ్యవధి పడుతుందని అధికారులు చెబుతున్నారు.

విజేత నిర్ణయం ఎలా ?

పోలైన ఓట్లలో సగం కంటే ఒక్క ఓటు అధికంగా ఒక అభ్యర్థికి వస్తే వారిని విజేతగా రిటర్నింగ్ అధికారి ప్రకటించవొచ్చు. 8 రౌండ్ల ఇనీషియల్ కౌంటింగ్ తర్వాత ఆపై ఎన్ని రౌండ్లు ఎలిమినేషన్ ఉంటుందో చెప్పలేని పరిస్థితి. 37 మంది అభ్యర్థులు ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బరిలో ఉండగా ప్రధాన పోటీ పిడిఎఫ్, వైసిపి, టిడిపి మధ్య ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. నాలుగో స్థానంలో బిజెపి ఉంటుంది. రౌండ్ల వారీగా ఎన్ని ఓట్లు ఏ అభ్యర్థికి వస్తాయన్నదానిపైనా విజయం ఆధారపడి ఉంటుంది. ప్రాధాన్యతా క్రమంలో ఓటరు అభ్యర్థికి ఓటు వేసే అవకాశం ఉండడంతో ఆ ఓట్ల లెక్కింపు వల్ల సమయం ఎక్కువ పడుతుంది. ఈ ప్రాధాన్యతా క్రమంలో చివర ఉన్న అభ్యర్థులు ఎలిమినేషన్ అవుతూ ఉంటారు. రెండో ప్రాధాన్యతా ఓటుపైనే విజయం ఈ ఎన్నికల్లో ఆధారపడి ఉంటుందన్నది పలువురి నోట వినిపిస్తోంది. ఉత్తరాంధ్రలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యతా ఓటుతో గెలుపొందిన వారెవరూ 2007 నుంచి ఇప్పటివరకూ లేరు. ఈ దఫా కూడా ఇదే ఫార్ములా ఉంటుందన్నది భావిస్తున్నారు. అందుకే రెండో ప్రాధాన్యత ఓటు కీలకం కానుంది.

పిడిఎఫ్ గెలుపుపై అంచనా

శాసన మండలి ఎన్నికల ఫలితాలు, విజయావకాశాలపై ఇప్పటికే ఉత్తరాంధ్ర అంతటా చర్చోపచర్చలు జోరుగానే సాగుతున్నాయి. ప్రచారంలో 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ముందున్నారు. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వర్గాలు, సిబ్బంది నివేదికలు, ఓటర్ల మాటలను పరిశీలిస్తే రమాప్రభ ప్రభంజనమే సర్వత్రా ఉంటుందని పలువురు చెబుతున్నారు. టీచర్లు, ఉద్యోగులు, నిరుద్యోగుల విషయంలో రాష్ట్రంలోని అధికార వైసిపి సర్కారు నిర్బంధ వైఖరితో ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు పడిందన్నది పై నివేదికల సారాంశం. తెలుగుదేశం, బిజెపిలకు వారివారి పార్టీలకు చెందినవారి ఓట్లు పడినప్పటికీ పిడిఎఫ్‌కు వారు రెండో ప్రాధాన్యత ఓటు వేసినట్టు తెలుస్తోంది.

భద్రాచలానికి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - విజయనగరం కోట

శ్రీ రామ నవమి సందర్భంగా ఈనెల 29న విజయనగరం నుంచి భద్రాచలంకు ప్రత్యేక అల్ట్రా డీలక్స్ బస్ సర్వీసును ఏర్పాటు చేసినట్లు ఆర్‌టిసి విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ బస్సు 29వ తేదీ సాయంత్రం 4.30గంటలకు విజయగనరం ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి బయలుదేరి గురువారం ఉదయం 5గంటలకు భద్రాచలం చేరుతుందని తెలిపారు. తిరిగి అదేరోజు (30వ తేదీ) సాయంత్రం 5గంటలకు భద్రాచలం నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 5.30 లకు విజయనగరం చేరుతుందని తెలిపారు. టిక్కెట్ ధర ఒక వైపు పెద్దలకు రూ.840, పిల్లలకు రూ.455గా నిర్ణయించినట్లు తెలిపారు. టిక్కెట్లు కావలసినవారు ఆర్టీసీ కాంప్లెక్స్ నందు రిజర్వేషన్ కౌంటర్ లో గానీ, ఔఔఔ.ూూూఞక్కు-జఉచీూక్ష్మీచీజు.క్ష్మీచీ వెబ్ సైట్ ద్వారా గానీ అడ్వాన్సు రిజర్వేషన్ చేసుకోవాలని తెలిపారు.

నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు

- చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలి
- మండలాల్లో స్పందన నిర్వహించాలి
- ఆదర్శ పంచాయతీగా నందిగాం : కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

ఉగాది పండగ తర్వాత పొడి గాలులతో, వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందని హెచ్చరికలు ఉన్న దృష్ట్యా జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి అధికారులకు ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఎత్తివేసిన వెంటనే క్రాష్ ప్రోగ్రాం ప్రారంభించి 48 గంటల్లో బోరు బావులను, పైప్ లైన్లను మరమ్మతు లను చేపట్టాలని, అందుకోసం యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆర్‌డబ్లుఎస్ ఎస్ఇ ఉమాశంకర్‌కు ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి సచివాలయం, ఆర్.బి.కె ల వద్ద, రైల్వే స్టేషన్ల వద్ద, ఆర్‌టిసి బస్సు స్టాండ్ల వద్ద చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి సన్నద్ధత చలివేంద్రాల ఏర్పాటు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల హాజరు తదితర అంశాలపై బుధవారం ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డి, ఆర్‌డబ్లుఎస్ ఎఇలు, మున్సిపల్ కమిషనర్లతో వెబెక్స్ ద్వారా సమీక్షించారు. ఈనెల 22 న ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా జిల్లా అంతటా ప్రపంచ జల దినోత్సవం జరుపుకోవాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది హాజరు పై సమీక్షిస్తూ తక్కువగా ఉన్న వారికి కారణాలను అడిగారు. డిప్యుటేషన్‌పై వేరే చోట పని చేస్తున్న వారికి ఒడి మార్క్ చేయాలని, సచివాలయ సిబ్బంది సమయ పాలన తప్పక పాటించాలని అన్నారు. వాలంటీర్లు కూడా హాజరు వేయాలని, సక్రమంగా హాజరు కానీ వారిని తొలగించాలని అన్నారు. ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో స్పందన నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కాస్ట్ సర్టిఫికేట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికీ వెంటనే జారీ చేయాలనీ సూచించారు.



ఆదర్శ పంచాయతీగా నందిగాం

భోగాపురం మండలం నందిగాం పంచాయతీ జాతీయ స్థాయిలో ఆదర్శ పంచాయతీగా నిలిచినందుకు జిల్లా కలెక్టర్ సూర్య కుమారి అభినందించారు. ప్రతి ఒక్క అధికారి స్వయంగా ఆ గ్రామాన్ని సందర్శించి అక్కడి అభివృద్ధిని చూసి వారి గ్రామాల్లో చైతన్యం చేయాలని తెలిపారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా నిలపడం లో ఆ గ్రామ సర్పంచ్ కీలకంగా వ్యవహరించారని, స్వంత ఖర్చుతో నార సంచులు కుట్టించి అందరికి అందించారని అభినందించారు. జల సంరక్షణ, రీ ఛార్జ్ , ఘన వ్యర్థాల నిర్వహణ, సోలార్ పెనెల్స్ , వెర్మి కంపోస్ట్ తయారీ, మార్కెటింగ్ చేయడం లో గ్రామం నూతన విధానాలను అవలంభించిందన్నారు. బాల్య వివాహాల నిరోధం, సఖి గ్రూప్ ల ఏర్పాటు , చైతన్యం, రహదారులు, కాలువలు, అంగన్వాడీల వద్ద న్యూట్రీ గార్డెన్ పెంపకం చేపట్టడం లో ప్రజలను భాగస్వామ్యులను చేయడంలో ఆ గ్రామ సర్పంచ్, అధికార యంత్రాంగం సఫలీక్రుతులయ్యారని తెలిపారు. జెడ్‌పి సిఇఒ డాక్టర్ అశోక్ కుమార్, ఆర్‌డబ్లుఎస్ఇ ఉమా శంకర్, మున్సిపల్ కమిషనర్ శ్రీ రాములు నాయుడు, పబ్లిక్ హెల్త్ ఇఇ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 20 మేకలు మృతి

ప్రజాశక్తి-రేగిడి

మండలం లోని సంకిలి గ్రామం గొల్ల వీధికి చెందిన నాగళ్ళ అప్పన్నకు చెందిన 20 మేకలు బుధవారం కుక్కల దాడిలో మతి చెందాయి. వీటిలో పది మేకలు పెద్దవి, మరో 10 మేకలు చిన్నవి ఉన్నాయి. దీంతో సుమారు మూడు లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేశారు. మేకల శాలలోకి గుంపులుగా వచ్చిన కుక్కలు మేకలపై దాడి చేశాయి. పట్టపగలే కుక్కలు దాడి చేసి మేకలను చంపేయడంతో ఆకుటుంబం కన్నీరుమున్నీరైంది. వైసిపి నాయకుడు మజ్జి శ్రీనివాసరావు వెళ్లి పరిశీలించారు. అధికారులు నష్ట పరిహారం ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.


మృతి చెందిన మేకలు

నేడు పొట్టి శ్రీరాములు జయంతి

విజయనగరం : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలను గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలని కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో గురువారం ఉదయం 10 గంటలకు పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అపరాలకు మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో అపరాల పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని ఎపిరైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉపాధ్యక్షులు ఎల్.ఆదినారాయణ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఆర్‌బికెల్లో కేంద్రాలు పెట్టి కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించినా ఎక్కడా జరగడం లేదని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల పెసలు, మినుములు క్వింటా వద్ద సుమారు రూ.800 తక్కువకు వ్యాపారులకు అమ్ముకోవలసి వస్తున్నదని తెలిపారు. గంట్యాడ మండలం వసాది గ్రామంలో పంట అమ్మకాల చివరలో గతనెల 27న ఎఫ్‌పిఒ ద్వారా కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటికీ రైతులు ఆర్‌బికెల చుట్టూ తిరుగుతున్నా కొనుగోలు చేయడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే అపరాల రైతులను ఆదుకోవాలని కోరారు.

17 నుంచి అగ్నివీర్ వాయు రిజిస్ట్రేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అగ్నిపథ్ స్కీంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవటం ద్వారా యువత త్వరితగతిన జీవితంలో స్థిరపడొచ్చని సెట్విజ్ సిఇఒ రామ్ గోపాల్ తెలిపారు. అగ్నివీర్ వాయు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. అగ్నివీర్ వాయు పరీక్ష ద్వారా ఎయిర్ పోర్స్‌లో చేరి తమ సేవలను దేశానికి అందించేందుకు యువతకు ఇదొక సువర్ణావకాశమని తెలిపారు. మార్చి 17 నుంచి 31 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. 2002 డిసెంబర్ 26 నుంచి 2006 జూన్ 26 మధ్యలో జన్మించిన స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కేవలం అవివాహిత యువతీ, యువకులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించటం ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుందని, మే 20వ తేదీ నుంచి ఆన్‌లైన్ పరీక్షలు ఉంటాయని వివరించారు. ఇంటర్ విద్యార్హత ఉండాలని, మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లీషు సబ్జెక్టులు లేదా మూడు సంవత్సరాల డిప్లొమా ఇంజినీరింగ్, రెండు సంవత్సరాల ఒకేషనల్ కోర్సులు చదివిన యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు https://agnipathvayu.cdac.inవెబ్ సైట్ ద్వారా పూర్తి వివరాలు పొందవచ్చని, ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తొలిరోజు 1436 మంది గైర్హాజరు • విజయనగరంలో ఇద్దరు విద్యార్థులు డిబార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్ మొదటి ఏడాది పరీక్ష బుధవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 78 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 25825 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 24,389 మంది హాజరయ్యారు. 1436 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9 గంటలకు పరీక్ష సమయం కావడంతో 8 గంటలకే విద్యార్థులంతా కేంద్రాలకు చేరుకున్నారు. వారితో పాటు తల్లి తండ్రులు కూడా పిల్లల్ని పరీక్ష కేంద్రాలు వద్ద కు తోడ్కొని వచ్చి బాగా పరీక్ష రాయాలని శు భాకాక్షల తెలిపారు. ఒక్కనిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని అధికారులు ప్రకటించిన నేపథ్యంలో కాస్తా ఆలస్యంగా వచ్చిన వారంతా ఉరుకులు, పరుగులతో కేంద్రాల్లోకి వెళ్లారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు , కాలేజీ సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు లేకుండా తనిఖాలు చేపట్టి లోపలకు పంపించారు. విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను అధికారులు డిబార్ చేశారు. ఈ సందర్భంగా అర్ఐఒ ఎం.సత్యన్నారాయణ మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు. తొలి రోజు 53 కేంద్రాలను తనిఖీ బృందాలు పరిశీలించాయన్నారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రారంభమవుతుందని, విద్యార్థులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.


విజయనగరంలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

డెంకాడ : ఇంటర్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తనిఖీ చేశారు. డెంకాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌ను సందర్శించారు. తాగునీరు, తరగతి గదిలో లైట్లు, ఫ్యాన్లు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష నిర్వహణకు తీసుకున్న చర్యలను కళాశాల ప్రిన్సిపాల్ వివరించారు. పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించా లని, మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూడాలని, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుతించవద్దని కలెక్టర్ ఆదేశించారు.


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

24,389 మంది హాజరు

ఇంటర్ మొదటి సంవత్సరం తొలిరోజు పరీక్షకు 19,880 మంది సాధారణ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 19,140 మంది హాజరయ్యారు. 740 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 5945 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 5,249 మంది హాజరయ్యారు. 696 మంది గైర్హాజరయ్యారు. మొత్తంమీద తొలిరోజు పరీక్షను 24,389 మంది రాశారు.

నిండు గర్భిణీ పరీక్షకు హాజరు

పరీక్షా కేంద్రంలో పురిటినొప్పులు.. ఆస్పత్రికి తరలింపు

పార్వతీపురంరూరల్ : పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో పట్టణంలోని కొత్తవలసకు చెందిన గర్భిణీ పాలవలస దేవి (22) పరీక్షకు హాజరైంది. దేవి ఒక ప్రైవేటు ఒకేషనల్ కళాశాలలో వెటర్నరీ డెయిరీ ఒకేషనల్ కోర్సు చదువుతోంది. తొమ్మిది నెలల గర్భిణీ అయిన ఆమె తొలిరోజు జనరల్ ఫౌండేషన్ పేపర్ పరీక్ష రాస్తుండగా పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే ప్రిన్సిపల్ ఆకులరాజు సంబంధిత అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వారి అనుమతితో ఆమెను వెంటనే 108 వాహనంలో జిల్లా అసుపత్రికి తరలించారు. సూపరింటెండెంట్ ఆమెను వైద్యుల పరిశీలనలో ఉంచి చికిత్స అందించారు. ఎక్కువ సేపు ఒకేలా కూర్చోవడంతో స్వల్పంగా నొప్పులు వచ్చాయని, ఇంకా డెలివరీకి రెండు రోజులు సమయం పడుతుందని వైద్యులు తెలిపారు.


ఆస్పత్రిలో ఉన్న గర్భిణీ పాలవలస దేవి


విద్యార్థులను తనిఖీ చేస్తున్న కానిస్టేబుల్

'ఆనందోబ్రహ్మ'లో ఉగాది వస్త్రధారణ పోటీలు

బొబ్బిలి : ఈనెల 19 ఆదివారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో జరగనున్న పదవ ఆనందోబ్రహ్మ ప్రదర్శనలో ఉగాది పండగ సందర్భంగా ప్రత్యేక కదంబ కార్యక్రమాలు చేపడుతున్నట్లు మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు యం.విజయ మోహన్‌రావు బుధవారం తెలిపారు. తెలుగుదనాన్ని ప్రతిబింబించే సాంప్రదాయ వస్త్రధారణ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అచ్చ తెలుగు పురుషుల పంచ కట్టు, తెలుగు మహిళల చీర కట్టు, తెలుగు అమ్మాయిల పట్టు పరికిణి ఓణీలు, తెలుగు బాల బాలికల దుస్తులతో ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న అన్ని వయసుల వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని చెప్పారు. వివరాలకు పాల్గొనేవారు ఈనెల 18 సాయంత్రంలోగా తమ వివరాలను 9440744741లో నమోదు చేసుకోవాలని కోరారు. సకల కళా ప్రదర్శనలో భాగంగా ఉగాది పండగ విశిష్ఠ తెలిపే నృత్యాలు, కర్ర సాము, గంగిరెద్దు నృత్య ప్రదర్శన, హాస్య నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. కేవలం పది రూపాయల టికెట్‌తో సాయంత్రం ఐదు గంటలకే ఆడిటోరియం చేరుకుని కళాకారులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులు డివి అప్పారావు, రామద్ర గోవింద రావు, పి నాగరాజు, ఎం వెంకటరావు, కే పరంకుశం పాల్గొన్నారు.



పరీక్షా సామగ్రిని అందిస్తున్న టిడిపి నాయకులు

విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ పంపిణీ

వేపాడ : మండలంలోని బికె నాయుడుపేట ఆదర్శ పాఠశాలలో 91 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన సామగ్రిని నియోజకవర్గం టిడిపి నాయకులు గొంప కృష్ణ బుధవారం పంపిణీ చేశారు. ఒక్కొక్క విద్యార్థికి ప్లాంక్, రెండు పెన్నులు, ఒక పెన్సిల్, స్కేల్, ఎరైజర్, రబ్బరు, సుమారు రూ.15వేలు విలువ గల వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్ ఈశ్వరరావు, ఎస్‌డిటి అధ్యక్షుడు సేనాపతి గణేష్, టిడిపి నాయకులు సిరికి రమణ, తాడి కష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

వేపాడ : మండలంలోని నీలకంఠ రాజపురం అగ్రహారంలో బుదవారం ఎస్‌సి కాలనీలోని బోరుతో పాటు గ్రామంలో పనిచేయని మరో రెండ బోర్లను సర్పంచ్ గొటివాడదేవి పర్యవేక్షణలో బాగు చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని బోర్లను బాగు చేయించినట్లు సర్పంచ్ తెలిపారు. ఆమె చొరవ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల పరిశీలన

వేపాడ : మండలంలోని వావిలపాడు కస్తూరిబా బాలికల వసతి గృహం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేపాడ పాఠశాలలను ఎంఇఒ జి. శ్రీదేవి బుధవారం పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం, వర్క్ బుక్స్, ఉపాధ్యాయులు విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. కార్యక్రమంలో సిసిఆర్‌పి లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు వల్లి, కెజిబివి ఎస్ఒ కిరణ్మయి పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే తోటకు నిప్పు



తోటను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

డెంకాడ : టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎఎంసి వైస్ చైర్మన్ కాగితాల సత్య నారాయణ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేకనే అతనికి సంబంధించిన ఆరెకరాల సరుగుడు తోటకు నిప్పటించారని టిడిపి మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ అన్నారు. దగ్ధమైన తోటను బుధవారం టిడిపి బృందం పరిశీలించింది. బంగార్రాజు పేట గ్రామంలో రాజకీయంగా బలంగా ఉన్న సత్యన్నారాయణను వైసిపిలో చేరమని ఒత్తిడి తెచ్చారని ఆయన నిరాకరించడంతో కక్ష కట్టి సరుగుడు తోటను దగ్ధం చేశారన్నారు. ఈ చర్యను ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు, నాయకులు కలిదిండి పాణీరాజు, పడాల చిన్నారావు, కోయనేని రమణ, కొర్నాన ఆదిబాబు, పిన్నింటి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విజయనగరం టౌన్ : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు నగరంలోని ఏంజెల్ ఎన్‌జిఒ ఆధ్వర్యాన ర్పాటు చేసిన చలివేంద్రాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి ఎండలకు వడ దెబ్బ తగల కుండా చల్లని నీరు, చల్లని మజ్జిగ. పండ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలు తీసుకొన్ని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాయుడు, ఆర్ఎం డాక్టర్ గౌరీశంకర్, ఏంజెల్ ఎన్‌జిఒ అధ్యక్షులు ఎంఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. మెప్మా సభ్యులు మజ్జిగ అందిస్తూ సహాయం చేశారు సమాచార శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ఆనంద్, ఆయన సోదరుడు గోపాల్ సహాయ సహకారాలు అందించారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన

విజయనగరం : అంతర్జాతీయ వినియోగ దారుల దినోత్సవం సందర్భంగా శ్రీసాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన వాకర్స్‌కు బుధవారం అవగాహన కల్పించారు. అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న నడక మైదానంలో వినియోగ దారుల దినోత్సవ ప్రాముఖ్యతను, సభ్యులకు సంఘసేవకులు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు అవగాహన కల్పించారు. దేశంలో 1986లో వినియోగ దారుల రక్షణ చట్టం అమలులోకి వచ్చిందని, ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం వినియోగదారులకు ఆరు హక్కులను కల్పించిందని తెలిపారు. ఈ చట్టాలు రాక మునుపు కోర్టును ఆశ్రయించే వారని, ఈ చట్టాలు అమలు చేయడంతో ప్రజలంతా హక్కులను వినియోగించుకుంటున్నారని అన్నారు. క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు (సిహెచ్ రమణ) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు ఎ.తిరుపతిరావు, పైడయ్య, నలమరాజు, వి. శ్రీనివాసరావు. టి.ఆదినారాయణ, ఆర్‌సిహెచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు

పర్వతారోహకుడికి అభినందనలు

విజయనగరం టౌన్ : క్రీడలకు, క్రీడాకారులకు, యువతకు తమ వంతు ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. పర్వతారోహకుడు , రేగిడి మండలం ఉణుకూరు గ్రామానికి చెందిన మెరుగుల నాగరాజు బుధవారం ఈశ్వర్ కౌశిక్ ను తన కార్యాలయంలో కలిశారు. నాగరాజు త్వరలో చేపట్టనున్న ఎవరెస్టు అధి రోహణకు ఆర్థిక సహాయంతో పాటు , ప్రోత్సాహాన్ని అందించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ పర్వత అధిరోహణ ను ప్రేమించే నాగరాజు గతంలో ఆఫ్రికా ఖండంలోని టాంజానియా దేశంలో 5, 985 మీటర్ల ఎత్తు గల కిలిమంజారో పర్వతాన్ని కేవలం ఏడు రోజులలో అధిరోహించాడని తెలిపారు. సిక్కిం రాష్ట్రంలోని 5,450 మీటర్ల ఎత్తు గల లఖో ఖాన్ సే పర్వతాన్ని అధిరోహించి శభాష్ అనిపించుకుని, ఆ రాష్ట్ర ప్రభుత్వం బంగారు పతకం తో పాటు, ఉత్తమ అధిరోహకుడు, ఉత్తమ మారథా న్ పురస్కారాన్ని కూడా అందుకున్నట్టు తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని అన్నారు. తన గ్రామంలోని ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు.

మడ్డువలసలో అన్నదానం

వంగర : మండలంలోని మడ్డువలస ప్రాజెక్టు వద్ద ఉన్న కొండపైన ఉన్న శిరిడి సాయి ఆలయం 14వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అక్కడ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మడ్డువలస, జగన్నాథవలస, మగ్గూరు, వంగర గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

నాగావళిని దోచేస్తున్నారు..

- రేగిడి, బొడ్డవలస, తునివాడ కేంద్రాలుగా ఇసుక అక్రమ రవాణా
- ఇసుకాసురుల ఆగడాలకు పడని అడ్డుకట్ట

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బొడ్డవలస, తునివాడ, రేగిడి, కొమిరి వెంకటాపురం గ్రామాల కేంద్రాలుగా నాగావళి నది పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతుంది. ఆయా గ్రామాల పరిధిలో నాగావళి నదిలో జెసిబితోను తవ్వి ఇసుకను ట్రాక్టర్లతో రాజాం, చీపురుపల్లి, విజయనగరం, తదితర పట్టణాలకు అధిక ధరలకు విక్రయాలు చేపడుతున్నారు. ఇసుకాసురులు అక్రమ రవాణాతో లక్షలలో వెనకేసుకుంటున్నారు. రాత్రులు మరీ విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ ఇసుక అక్రమ రవాణాతో ప్రభుత్వాదాయానికి గండి కొట్టిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మరి కొంతమంది ఎడ్ల బల్లలో ఇసుక తెచ్చి తోటల్లోనూ, పంట పొలాల్లోను, లొంగ గుడ్డల్లోనూ డంపింగ్ చేసి రాత్రి పూట ట్రాక్టర్లు, లారీలతో ఇసుకను పట్టణాలకు అధిక ధరలకు అక్రమ రవాణా జరుపుతున్నారు. ఈ అక్రమ ఇసుక రవాణాకు అడ్డ కట్టలేదని పలు గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాతో రేయింబవళ్లు నాగావళి నదిని దోచేస్తున్నారు.

మండలంలో నాగావళి నదికి ఇసుక ర్యాంపు మంజూరు లేకపోవడంతో అక్రమ ఇసుక రవాణా తరలిపోతుందని పలువురు విమర్శిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతోనే మరింత ఇసుక అక్రమ రవాణాకు దారితీస్తుందని పలువురు పెదవి విరుస్తున్నారు. నాగావళి నది పరివాహక ప్రాంతాలలో, రాజాం- పాలకొండ ప్రధాన రహదారిలో ఉంగరాడమెట్ట, బూరాడ జంక్షన్‌లలో పర్యవేక్షణ లేకపోవడంతోనే విచ్చలవిడిగా ఇసుక రవాణా జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. పగటిపూట ఈ రహదారి గుండా ఇసుక ట్రాక్టర్లతోనూ, లారీలతోనూ అక్రమంగా తరలిపోతున్న పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీస్, రెవెన్యూ అధికారులు స్పందించి పర్యవేక్షణ జరిపి అక్రమంగా తరలిస్తున్న ఇసుకకు అడ్డకట్ట వేసి, అక్రమంగా తరలిస్తున్న ఇసుక యజమానులపై చర్యలు తీసుకోవాలని, ట్రాక్టర్లులు, లారీలను సీజ్ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ఇసుక పోగులు



ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు

తొలి రోజు ప్రశాంతం



బొబ్బిలి: పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

ప్రజాశక్తి- వేపాడ

స్థానిక జిజె కళశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి పరీక్షకు 240 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 232 మంది హాజరయ్యారు. 8 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ పరిశీలన చేసింది. వల్లంపూడి ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు.

బొబ్బిలి: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. బొబ్బిలి పట్టణంలో ఆరు కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు జరిగాయి. మొదటి సంవత్సరంలో 2,210 మంది విద్యార్థులకు గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరై 2107మంది విద్యార్థులు హాజర య్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలూ జరగకుండా పోలీసులు, అధికారులు పటిష్ట చర్యలు తీసుకున్నారు.

వంగర: మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో బుధవారం జరిగిన ఫస్ట్ ఇయర్ తెలుగు, హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షా కేంద్రానికి 236 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 232 మంది విద్యార్థులు హాజరయ్యారని, నలుగురు గైర్హాజరు అయ్యారని అక్కడ పరీక్షా కేంద్రం చీఫ్ సూపర్‌డెంట్ కొరటాన నారాయణరావు తెలిపారు. అక్కడ జరిగిన పరీక్షలను తహశీల్దార్ డి. ఐజాక్ పరిశీలించారు.



నెల్లిమర్ల: పరీక్షా కేంద్రానికి వెళ్తున్న వికలాంగ విద్యార్థి



వేపాడ: పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నెల్లిమర్ల: ఇంటర్ పరీక్షలు బుధవారం స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల కళాశాల ప్రారంభమయ్యాయి. నెల్లిమర్ల పరిధిలో 2,077 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1992మంది హాజరయ్యారు. 85 మంది గైర్హాజరయ్యారని సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్య నారాయణ తెలిపారు. ఎస్ఐ పి. నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద బందో బస్తు నిర్వహించారు. దీంతో తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది.

నిబంధనలు పాటించాలి

బాడంగి : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎఎంవి ఇన్‌స్పెక్టర్ ఐశ్వర్య లక్ష్మి కోరారు. స్థానిక ప్రధాన కూడలిలో ఆమె బుధవారం వాహనాలను తనికీ చేసి పలు సూచనలు చేశారు. బాడంగి ఎస్ఐ ఆర్ జయంతితో పాటు 4 మండలాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా ట్రాఫిక్ సిగ్నల్స్ పై, వాహనాలు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్, సీటు బెల్ట్ తప్ప సరిగా ధరించాలని, అధిక వేగంతో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని అన్నారు.




వాహనదారులతో మాట్లాడుతున్న అధికారులు

నెలాఖరులోపు భూముల రీసర్వే పూర్తి

కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం-పూసపాటిరేగ, డెంకాడ

సమగ్ర భూముల రీసర్వేను నెలాఖరులోగా పూర్తిచేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి రెవిన్యూ అధికారులు, సర్వే సిబ్బందిని ఆదేశించారు. భూముల రీసర్వే జరుగుతున్న తీరును పరిశీలించేందుకు కలెక్టర్ బుధవారం పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో పర్యటించారు. పూసపాటిరేగ మండలం లంకలపల్లి పాలెం, డెంకాడ మండలం గంట్లాంలో రీసర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అవసరమైన సంఖ్యలో గ్రామ సర్వేయర్లను డిప్యూటేషన్‌పై రీసర్వే పనుల కోసం నియమించినందున వారి సేవలను వినియోగించుకొని త్వరగా సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. డెంకాడ మండలంలో రెండు బృందాలతో రీసర్వే జరుగుతున్నట్టు తహశీల్దార్ ఆదిలక్ష్మి వివరించారు. పది గ్రామాల్లో పూర్తిచేశామని, మరో 16 గ్రామాల్లో పూర్తికావలసి వుందని వివరించారు. పూసపాటిరేగలో రీసర్వే జరుగుతున్న లంకలపల్లి పాలెంను సందర్శించి డిప్యూటీ తహశీల్దార్ ద్వారా మండలంలో జరుగుతున్న సర్వే గురించి తెలుసుకున్నారు. సర్వేను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.



సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సూర్యకుమారి

తాగునీటి కొరత నివారణకు చర్యలు

బొబ్బిలి: ఉమ్మడి జిల్లాలో వేసవిలో తాగునీటి కొరతను నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పబ్లిక్ హెల్త్ ఇఇ దక్షిణమూర్తి అన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీకు తాగునీరు సరఫరా చేసే భోజరాజపురం ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో రాజాం, పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు, పార్వతీపురం మున్సిపాలిటీలలో తాగునీటి సమస్య లేదన్నారు. మిగిలిన మున్సిపాలిటీలలో తాగునీటి సమస్య ఉందని, నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బొబ్బిలి వేగావతినది ఎండిపోవడంతో బొబ్బిలికు తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. పెద్దగెడ్డ నీరు విడుదల చేసేందుకు సంబంధిత డిఇతో మాట్లాడినట్లు చెప్పారు.

నూతన పైపులైన్ కాంట్రాక్టర్ తో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఇఇ దక్షిణమూర్తి

బొబ్బిలి పట్టణానికి తాగునీరు సరఫరా చేసేందుకు సువర్ణముఖినది నుంచి నూతన పైపులైన్ కాంట్రాక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పైపులైన్ మార్చాలని సూచించారు. ఏడాదిలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని కంటకాపల్లి పంచా యతీ కార్యాలయం వద్ద శారద అండ్ మెటల్స్ కర్మాగారం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించిందని కంపెనీ హెచ్‌ఆర్ ఎజిఎం. హెచ్.సన్యాసిరావు అన్నారు. బుధవారం నిర్వహించిన శిబిరాన్ని కంటకాపల్లి, కొత్తూరు, సాంబయ్యపాలెం, కొత్త సుంకరపాలెం, కాటకాపల్లి, చిన్నరావుపల్లి, పెదరావుపల్లి, బలిఘట్టం తదితర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు. మెడికల్ క్యాంపలో చికిత్స పొందిన వారికి అవసరమైతే శస్త్ర చికిత్సలు కూడా చేస్తామని తెలిపారు. కంపెనీ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి శస్త్ర చికిత్స కైనా వెనుకాడబోమని తెలిపారు. మెడికల్ క్యాంపులు వివిధ రకాల వైద్య నైపుణ్యలతో, వైద్య సేవలు నిర్వహించి ప్రజలకు అవసరమైన వైద్య సహాయం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ మెడికల్ క్యాంప్‌లో గైనకాలజిస్ట్ ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, ఇఎన్టి, ఈసీజీ, షుగర్ బీపీ టెస్ట్ చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ తిరుమల, డాక్టర్ అరుణ కుమార్, గ్రామ పెద్దలు బోధల స్వామినాయుడు, మదిన అప్పల రమణ, కాటకాపల్లి సర్పంచ్ కృష్ణ, కాశీ విశ్వనాధ రావు, సారికి వెంకటేశ్వరరావు, తూరుబిల్లి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.




మందులను పంపిణీ చేస్తున్న కర్మాగార ప్రతినిధులు

క్షయపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - రామభద్రపురం

క్షయ వ్యాధి పై అప్రమత్తంగా ఉండటం అవసరమని ఆరికతోట పిహెచ్‌సి వైద్యాధికారి రత్నదీపక్ తెలిపారు. బాడంగి టిబి యూనిట్ పర్యవేక్షకులు రమేష్ ఆధ్వర్యంలో బుధవారం బూసాయ వలస హైస్కూల్ ఆవరణలో ప్రపంచ క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకి మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించటం, రక్తపు జీరలు కనిపించడం, కపం వంటి లక్షణాలు కనిపిస్తే అది క్షయ వ్యాధిగా భావించి వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ అధికారులును సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాధి నివారణ కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు, వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒ మల్లేశ్వరరావు, సిబ్బంది మధు, సరస్వతి, హైమవతి, భవానీ పాల్గొన్నారు.



రామభద్రపురం: అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

బాడంగి: మానవాళికి పెను శాపంగా పరిణమించే వ్యాధుల్లో క్యేన్సర్ ముందు వరుసలో ఉంటుందని స్థానిక సిహెచ్‌సి సూపెరడెంట్ రాజా రమేష్ అన్నారు. ఆస్పత్రి ఆవరణలో బుధవారం ప్రపంచ క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా ఆయన మాట్లాడారు. మరణాన్ని ఆహ్వానించే ఈ వ్యాధిని కాస్త ముందుగానే పసిగడితే జీవిత కాలాన్ని పొడగించే వీలుందని అధ్యయనాలు చెబుతున్నాయ న్నారు. చెడు అలవాట్లుకి దూరంగా ఉండాలని సూచించారు.



బాడంగి: మాట్లాడుతున్న సూపరింటెండెంట్



మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

ఉపాధి పనుల పరిశీలన

వంగర : మండలంలోని సంగాంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు బుధ వారం పరిశీలించారు. ఈ మేరకు మస్తర్లు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ హరి నారాయణ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా గంటి



బొబ్బిలి : బొబ్బిలి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది గంటి గోపాలకృష్ణ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోర్టులో బుధవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. నూతన అధ్యక్షులుగా గంటి గోపాలకృష్ణశర్మ, కార్యదర్శిగా తమ్మిరెడ్డి దామోదర్, ఉపాధ్యక్షులుగా ఎన్. జగదీష్‌ను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నీట్ ర్యాంకర్లకు సన్మానం

ప్రజాశక్తి-గజపతినగరం

నీట్‌లో ఒపెన్ కేటగిరిలో 22వ ర్యాంకు సాధించిన గజపతినగరానికి చెందిన పారాధి లక్ష్మిపూజితను బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పూజిత తండ్రి సన్యాసిరావు, తల్లి నాగమణి ఇద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. సొంతూరులో పేదలకు సేవలందించ డమే తన ధ్యేయమని ఈ సందర్భంగా పూజిత తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జుత్తాడ చిట్టిబాబు, జవ్వాది సతీస్, పి.తిరుపతిరావు, పి. విశ్వనాధ్, కె. కామేష్ పాల్గొన్నారు.

బొబ్బిలి: బొబ్బిలికి చెందిన ఎంబిబిఎస్ విద్యార్థులు పిజి నీట్ పరీక్షల్లో సత్తా చాటారు. సాయినగర్ శ్రీచైతన్య విద్యా నికేతన్ పాఠశాలలో పదో తరగతి వరకు చదివిన ఎస్.సాయి మాధురి 1987వ ర్యాంకు సాధించింది. మాధురి తండ్రి ధర్మ వ్యాపారం చేస్తున్నారు. నాయుడుకాలనీకు చెందిన అలకు సాయి ప్రియాంక 9వేలు ర్యాంకు సాదించింది. ప్రియాంక తండ్రి శంకరరావు ఎపిఇపిడిసిఎల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.



గజపతినగరంలో పూజితను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

మిథునం నిర్మాత మృతి

ప్రజాశక్తి- రేగిడి



మండలంలోని వావిలవలసకు చెందిన మిథునం సినిమా నిర్మాత, వ్యాపారవేత్త మొయిద ఆనందరావు (కోటి) అనారోగ్యంతో బుధవారం విశాఖపట్నం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆనందరావు ఇక లేరని తెలిసి గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈయన మరణం రాజాం ప్రాంతంలో తీరనిలోటుని వ్యాపారవేత్తలు అన్నారు. అతని ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్రావు, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, తహశీల్దార్ టి కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ కాశీ విశ్వనాధరావు, ఎంఇఒ ఎం వరప్రసాదరావు, మండల సర్పంచులు, ఎంపిటిసిలు సంతాపం

నేరాలు ఘోరాలు

మద్యంతో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి- బొబ్బిలి

అక్రమంగా మద్యం తరలిస్తున్న పట్టణంలోని కంచరవీధికి చెందిన తాడితూరి వెంకటరమణను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ చెప్పారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి వెంకటరమణను అరెస్టు చేసి 21మద్యం సీసాలను సీజ్ చేశామన్నారు. అక్రమంగా మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత ఇటువంటి కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. అక్రమ మద్యం, నాటుసారాపై 9440902372 కు సమాచారమివ్వాలని కోరారు. దాడిలో సెబ్ సిబ్బంది చంద్రప్రసాద్, జయరామ్, మహిళా పోలీస్ రేఖా గాయత్రి, వాలంటీర్లు బిందు, మాధవి పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

విజయనగరం : పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద వాహన తనిఖీలను నిర్వహిస్తుండగా గంజాయి తరలిస్తున్న మహిళతో సహా మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి 20కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండుకు తరలించామని ఒకటో పట్టణ సిఐ బి. వెంకటరావు తెలిపారు. బుధవారం పోలీసు స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. రైల్వే స్టేషన్ సమీపంలో మార్చి 15న తెల్లవారు జామున వాహన తనిఖీలు చేపట్టాం. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బ్యాగులతో రైల్వే స్టేషను సమీపంలో అనుమానస్పదంగా సంచరిస్తూత కనింపించారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఈ కేసులో ఒడిస్సా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నారాయణపట్న బ్లాక్ బర్లి గ్రామానికి చెందిన ప్రమోద్ కుమార్ కోస్ల, అదే జిల్లా దమన్ జోడికి చెందిన తులసీ, కులదీప్‌లను అరెస్టు చేశామని సిఐ తెలిపారు. సమావేశంలో ఒకటో పట్టణ ఎస్‌ఐలు రామ గణేష్, భాస్కరరావు, ఎఎస్ఐ మన్మదరా వు, హెడ్ కానిస్టేబుల్ ఎవి రమణ, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న సిఐ వెంకటరావు